ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

శనివారం 14 జూన్ 2025

న్యూస్ బాక్స్

కెపాసిటర్లు అమర్చుకోవాలి

మల్యాల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంప్‌మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఈ మహేందర్ ఒక ప్రకటనలో కోరారు. అనుమతికి మించి అధిక హెచ్‌పీల సామర్థ్యం గల పంప్‌మోటార్ల వినియోగంతో లోడ్ పెరిగి విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడుతుందని, రైతులు తమ కనెక్షన్లను రెగ్యులర్ చేసుకోవాలని సూచించారు. రైతులు సహకరించాలని అన్నారు.


దివ్యాంగులు ఉపకరణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలి

ధర్మపురి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి నియోజకవర్గ పరిధిలో గల వికలాంగులకు, దివ్యాంగులకు ప్రభుత్వం నుంచి మంజూరు చేయబడే ట్రైసైకిల్స్, స్కూటీలు, ల్యాప్ టాప్‌లు, ట్యాబ్స్ మొబైల్స్ తదితర ఉపకరణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పీఏ సంగి సాయికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని, ఒక వ్యక్తికి కేవలం ఒక ఉపకరణం మాత్రమే ఇవ్వడం జరుగుతుందని ఆయన వివరించారు.

మహిళపై దాడి

గొల్లపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామ శివారులో జరిగిన భూవివాదంలో అగ్గిమల్ల గ్రామానికి చెందిన సట్ల లతపై ఆమె చిన్న మామ అయిన సట్ల నారాయణ దాడి చేయగా గాయాలయినట్లు గొల్లపల్లి ఎస్ఐ చిర్ర సతీష్ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సట్ల నారాయణ, కస్తూరి భూషణ్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏడాదిన్నరగా ఎదురుచూపులు



- కౌలు రైతుకు అందని పెట్టుబడి సాయం
- పెరిగిన కౌలు, విత్తన, ఎరువుల ధరలు
- అప్పులతో ఆర్థిక భారం

జగిత్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కౌలు రైతులకు ఎకరాకు 15,000 రూపాయల పెట్టుబడిసాయం అందిస్తామని హామీ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర గడిచినా కౌలు రైతుల ఆశలు నెరవేరడం లేదు. పెట్టుబడి సాయం అందకపోవడంతో పెట్టుబడి కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. పంట సాగుతో వచ్చిన కొంత మొత్తంతో వడ్డీలు కట్టలేక ఆర్థిక భారంతో సతమతమవుతున్నారు. ప్రతీ సీజన్‌లో ప్రభుత్వం నుంచి సహాయం అందక పెట్టుబడి కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు.

● జిల్లాలో 30 వేల మంది కౌలు రైతులు..

జిల్లాలో సుమారు 30వేల మంది వరకు కౌలు రైతులు ఉన్నట్లు అంచనా ఉంది. అరెకరం, ఎకరం భూమి ఉన్న రైతులు ప్రతీఏటా తమకున్న కొద్దిపాటి భూమితో పాటు ఇతరుల భూముల కౌలుకు తీసుకొని పలు రకాల పంటలు సాగు చేస్తున్నారు. గతేడాది పసుపు, మొక్కజొన్న, పత్తి తదితర సాగుకు ఎకరాకు కౌలుకు 12,000 రూపాయల నుంచి 15,000 రూపాయల వరకు చెల్లించేవారు. ప్రస్తుతం 20,000 వరకు పెరిగింది. వరి పొలాలకు 10,000 రూపాయల వరకు భూ యజమానులు కౌలు రైతుల నుంచి డిమాండ్ చేస్తున్నారు. పంట చేతికొచ్చినా, రాకపోయినా కౌలు మాత్రం చెల్లించాల్సి వస్తుంది. సాగుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. దీంతో కౌలు, చిన్న, సన్న కారు రైతులు పెట్టుబడి కోసం నానా పాట్లు పడుతున్నారు.

● సాయంపై స్పష్టత కరువు..

ఇప్పటికే జిల్లాలో వానాకాలం సాగు పనులు ప్రారంభం అయ్యాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి కౌలు రైతులకు సంబంధించిన వివరాలను సైతం సేకరించిన దాఖలాలు లేవు. దీంతో కౌలు రైతులను గుర్తించే యోచన కూడా చేయలేదని తెలుస్తోంది. ఈ ఏడాది సైతం కౌలు సాయం రైతులకు చేరే అవకాశాలు కనిపంచడం లేదు.

● మూడు సీజన్లు గడుస్తున్నప్పటికీ....

ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఆరు గ్యారెంటీల్లో భాగంగా రైతులతో పాటు కౌలు రైతులను ఆదుకుంటామని...

(మిగతా 8పేజీలో..)

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటాపాటలతో విద్యా బోధన

అదనపు కలెక్టర్ లత

కొడిమ్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటాపాటలతో విద్యాబోధన జరుగుతుందని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమ్మమాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని మండల స్థాయిలో సంబందిత ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లతో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని సూచించారు. అనంతరం ఎగ్ బిర్యానిని పిల్లలకు పంపిణీ చేశారు. అంతక ముందు అమ్మ మాట, అంగన్‌వాడీ బాట ప్రీస్కూల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి నరేష్, ఎంపీడీవో ఇ. స్వరూప, ఎంఈవో ఎ. శ్రీనివాస్, మల్యాల సీడీపీవో వీరలక్ష్మి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

బీర్‌పూర్: మండలంలోని తుంగూర్ గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మపురి సీడీపీవో వాణిశ్రీ, ఎంఈవో నాగభూషణం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శైలజ పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని అంబారిపేటలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవతి ఆధ్వర్యంలో అమ్మమాట... అంగన్‌వాడీ బాట ర్యాలీ నిర్వహించారు. కార్యక్ర మంలో అంగన్‌వాడీ టీచర్ విజయ, ఆయాలు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్‌లో ఆహారానికి ఉపయోగపడే మొక్కలను నాటాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్ షమీనాసుల్తానా అన్నారు. శుక్రవారం మండలంలోని జగ్గసాగర్, బండిలంగా పూర్ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో ఉపయోగపడే మొక్కలు నాటిన అనంతరం చి న్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్లు సరోజ, భూలక్ష్మి పాల్గొన్నారు.

కోరుట్ల(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భీముని దుబ్బ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ ప్రారంభించగా ఐసీడీఎస్ పట్టణ సూపర్ వైజర్ అల్వాల భారతి పాల్గొన్నారు. పట్టణంలోని కాజీపుర అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ రాజమణి ఆధ్వర్యంలో కిచన్ గార్డెన్ ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యతోనే ప్రభుత్వ పాఠశాలల మనుగడ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్టీయూ నాయకుడు బైరం హరికిరణ్

జగిత్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యతోనే ప్రభుత్వ పాఠశాలల మనుగడ ఉంటుందని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. ఇటీవల జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు, కిచెన్ షెడ్ల నిర్మాణాలకు ఈజీఎస్ నిధులను కేటాయించడాన్ని స్వాగతిస్తూ శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ సత్యప్రసాద్‌ను ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా 240 యూనిట్ల టాయిలెట్స్ 98 కిచెన్ షెడ్లు మంజూరు చేసినందుకు స్టేట్ టీచర్స్ యూనియన్ నాయకులు కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మచ్చ శంకర్, బైరం హరికిరణ్ ఉన్నారు.

మొహర్రంనకు నిధులు విడుదల చేయండి

జగిత్యాల అర్బన్, జూన్13 (ఆంధ్రజ్యోతి): మొహర్రం వేడుకలకు రాష్ట్రప్రభుత్వం నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్సీ కవిత మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కోరారు. శుక్రవారం అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో ఫోన్‌లో కవిత మాట్లాడారు. స్పందించిన మంత్రి నిధుల విడుదల అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. మొహర్రం సంప్రదాయబద్దంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కేటీఆర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

మల్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని మల్యాల పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి పదవికి విలువ ఇవ్వకుండా మాట్లాడిన కేటీఆర్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదుపత్రాన్ని ఎస్సై నరేశ్‌కుమార్‌కు అందజేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విండో డైరెక్టర్ సంత ప్రకాశ్‌రెడ్డి, కట్కం వినయ్, కోరెపు వెంకటేశ్, తీపిరెడ్డి కిషన్‌రెడ్డి, శ్రీనివాస్, ఎలేటి కిట్టురెడ్డి, మహేశ్‌రెడ్డి ఉన్నారు.



ఎస్సై నరేశ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మున్సిపల్ ఆవరణలో వైద్య శిబిరం

ధర్మపురి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ కార్యాలయంలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పారిశుధ్య కార్మికులు, ఆఫీస్ సిబ్బందికి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా వారందరికి వివిధ రకాల వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్ పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్

జగిత్యాల అర్బన్/మెట్‌పల్లి టౌన్/కోరుట్ల

జగిత్యా ల, మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపాలిటీలో పారిశుధ్య సిబ్బందికి, మహిళా సంఘాల సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపల్ కమిషనర్లు స్పందన, మోహన్, మారుతి ప్రసాద్, మెప్మా ఏవో శ్రీనివాస్, డీఎంసీ సునీత, టీఎంసీ రజిత, సీవో రాధ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఎస్పీ అశోక్‌కుమార్ - సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

సారంగాపూర్, జూన్, 13 (ఆంధ్రజ్యోతి) ప్రజా సమస్యలపై ప్రత్యేకదృష్టి సారించాలని ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో పోలీసులు ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాల నివారణే లక్ష్యంగా పోలీసులు పనిచేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరచుగా సందర్శించాలని ఆదేశించారు. పాత నేరస్తులపై ప్రత్యేకమైన నిఘా ఉంచాలని తెలిపారు. ప్రజలు, యువకులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులపై రివ్యూ నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్‌తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతీఒక్కరు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అంతకుముందు 1993లో మందుపాతరలో ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుల్ కిష్టయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ నిర్వహణ, ఏర్పాట్లపై ఎస్సై దత్తాద్రిని ప్రత్యేకంగా ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ రఘుచందర్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, రూరల్ సీఐ సుధాకర్, ఎస్సైలు దత్తాద్రి, సధాకర్, కుమారస్వామి, సుధీర్‌రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీతో పోలీస్ అధికారులు

మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- ప్రశ్నించడం కాదు పనిచేయడం ముఖ్యం - ఎమ్మెల్యే సంజయ్ కుమార్



కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు మంజూరు చేసిన నిధులతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, ప్రశించడం కాదు పని చేయడం ముఖ్యమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల పట్టణంలోని 9, 11వ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించాలనే విషయాన్ని జీవోలో స్పష్టం చేసిన విషయాన్ని గమనించాలన్నారు. యావర్ రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలోనే హామీ ఇచ్చారన్నారు. పట్టణంలో నాణ్యతతో కూడిన నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. రెండు దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉన్న ధరూర్ క్యాంప్ వాటర్ ట్యాంక్ వినియోగంలోకి తీసుకు వచ్చామన్నారు. అమృత్ కార్యక్రమంలో భాగంగా 36 కోట్లతో తాగునీటి పనులు జరుగుతున్నాయన్నారు. పట్టణంలోని హన్మాన్ వాడ, శంకుల పల్లి, పోచమ్మ వాడ నీటి సమస్య తీర్చడానికి వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపడతామన్నారు. పట్టణంలోని విలీన ప్రాంతాలకు రాష్ట్ర ప్రభుత్వం 20 కోట్లు, పట్టణానికి 20 కోట్లు మంజూరు చేసిందన్నారు. లే అవుట్ లేకుండా ఇంటి నిర్మణాలు చేపడితే తర్వాత తీసుకునే చర్యలకు సిద్ధగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, మున్సిపల్ మాజీ చైర్పన్ అడువాల జ్యోతి, గోలి శ్రీనివాస్, అడువాల లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ శ్రీలత, బాలే శంకర్, డీఈ నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడిమ్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. కొడిమ్యాల విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా సబ్‌స్టేషన్ పరిధిలోని కొడిమ్యాల, రామకిష్టాపూర్, కొండాపూర్, చింతల్లపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మల్యాల: మండలంలోని మల్యాల, తక్కళ్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు జరుగుతున్నందున ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. మల్యాల, ముత్యంపేట, రాజారం, నూకపల్లి, తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి, మానాల గ్రామాలకు మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాయికల్: మండలంలోని అల్లీపూర్ 33 కేవీ ఫీడర్ మెయింటనెన్స్, పీఎంఐ పనుల దృష్ట్యా శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు అల్లీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జగిత్యాల రూరల్ ఏడీఈ సింధూర్ శర్మ అన్నారు. మండలంలోని అల్లీపూర్, కిష్టంపేట, సింగరావుపేట, శ్రీరాంనగర్, కుర్మపల్లి గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మల్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రతిమ ఫౌండేషన్ సహకారంతో జీఎంఆర్, టాటా స్ట్రైవ్ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రాల్లో నిర్వహించనున్న ఉచిత ఉపాధి శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఫౌండేషన్ ఆర్గనైజర్ సల్మాన్ తెలిపారు. బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్(బ్యాంకింగ్), హోమ్ ఎయిడ్ హెల్త్, ఏసీ టెక్నీషియన్, ఎలక్ట్రికల్ హౌజ్ వైరింగ్, సోలార్ టెక్నీషియన్, మహిళలకు టైలరింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్హత ఉండి 18నుంచి 30 ఏళ్లలోపు గలవారు దరఖాస్తులు చేసుకోవచ్చుచని తెలిపారు. మరిన్ని వివరాలకు 9000305205లో సంప్రదించాలని సూచించారు.

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

పెగడపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పెగడపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములుగౌడ్ పేర్కొన్నారు. మండలంలోని నందగిరిలో శుక్రవారం ఎంపీడీవో ఎ శ్రీనివాస్ రెడ్డితో కలసి మార్కెట్ చైర్మన్ రాములుగౌడ్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. లబ్ధిదారులు త్వరగా నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీకార్యదర్శి మధు, నాయకులు సత్యనారాయణరెడ్డి, చెట్ల కిషన్, గంగాధర్, కడారి తిరుపతి, రవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి నిధుల మంజూరు హర్షణీయం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాయికల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణ మున్సిపాలిటీ అభివృద్ధికి రాష్ట ప్రభుత్వం 15 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయడం హర్షణీయమని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్ అన్నారు. రాయికల్ పట్టణంలోని అంగడిబజార్‌లో శుక్రవారం మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, మహిళా అధ్యక్షురాలు తాటిపాముల మమత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మ్యాకల అనురాధ, షర్మిల, లత, నాయకులు కొయ్యడి మహిపాల్ రెడ్డి, బాపురపు నర్సయ్య, ఎద్దండి దివాకర్, బత్తిని భూమయ్య, వాసం దిలీప్, షాకీర్, కడకుంట్ల నరేష్, మున్నా, షంషీర్, అశోక్, మోబిన్, రాకేష్ నాయక్, రాజేష్, సంతోష్, నరసింహా రెడ్డి, రాజరెడ్డి, ఆనందం, లక్ష్మీనారాయణ, రవి పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

కొడిమ్యాల, జూన్ 13 ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు వచ్చే మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వ్యాధులను గురించి అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వైద్య శాఖ అధికారులు మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఉప కేంద్రాల రిజిస్టర్లను, రికార్డులను తనిఖీ చేశారు. డీఎంహెచ్‌వో వెంట మండల వైద్యాధికారి నరేష్, సీహెచ్‌వో రాజశేఖర్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ సత్యనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీధర్, డీపీవో రవీందర్, హెల్త్ సూపర్ వైజర్లు శ్యాం, వెంకటనర్సమ్మ, ఎస్టీఎస్ శ్రీనివాస్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లు అందజేత



ముత్తునూర్‌లో ప్రొసీడింగులు అందజేస్తున్న అధికారులు, నాయకులు

వెల్గటూర్/ఎండపల్లి జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వెల్గటూర్ మండలంలోని అంబారిపేట, మొక్కట్రావ్ పేట, ముత్తునూరు, రాంనూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన వారికి శుక్రవారం ప్రొసీడింగులు అందజేశారు. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు ఎంపీడీవో వెంకటేశ్వర్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాటి గోపిక జితేందర్ రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లు అందజేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ గౌతమి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మెరుగు మురళీగౌడ్, వైస్ చైర్మన్ గొల్ల తిరుపతి, సింగిల్ విండో మాజీ చైర్మన్ పొనుగోటి రాంమోహన్‌రావు, యూత్ కాంగ్రెస్ జిల్లా సెక్రటరీ గంద్ర శ్రీకాంత్ రావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూదరి రమేష్, ఎండపల్లి ఎంపీడీవో నరేష్‌కుమార్ తహసీల్దార్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

తమ్ముడి చేతిలో.. అన్న హతం

- తాగిన మైకంలో అర్ధరాత్రి కర్రతో తలపై కొట్టి హత్య
- భూ వివాదాలే గొడవకు కారణం

పెగడపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా పెగడపల్లి మండలం అయిత్‌పల్లి గ్రామంలో గురువారం అర్ధరాత్రి తమ్ముడి చేతిలో అన్న హత్యకు గురయ్యాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. అయిత్‌పల్లి గ్రామానికి చెందిన కూన నర్సయ్య(50), కూన రాములు సొంత అన్నదమ్ములు. వీరికి కొంత కాలంగా భూవివాదాలు ఉండగా, పలుమార్లు గొడవలు జరిగాయి. గ్రామంలో జరిగిన పెద్దమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా ఇద్దరు అతిగామద్యం సేవించారు. ఈ నేపథ్యంలో గురువారం అర్ధరాత్రి సమయంలో పాతగొడవలను గుర్తుచేసుకుంటూ అన్నదమ్ములిద్దరు గొడవకు దిగారు. రాములు తనఅన్న నర్సయ్యను తలపై కర్రతోకొట్టగా తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మల్యాల సీఐ నీలం రవి, ట్రైనీ ఎస్.ఐ రవీందర్ కుమార్ శుక్రవారం ఉదయం ఘటనాస్థలానికి చేరుకుని విచారణ జరిపి, పంచనామా నిర్వహించి నర్సయ్య మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. మృతుడు నర్సయ్య భార్య రాజవ్వ ఫిర్యాదు మేరకు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ రవీందర్ కేసు నమోదు చేశారు.

దుబాయిలో బతికెపల్లి వాసి ఆత్మహత్య


లచ్చన్న (ఫైల్)

పెగడపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పుట్టినగడ్డపై ఉపాధిలేదని పరాయి దేశం వెళ్లి అక్కడ పనిదొరకక జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికెపల్లిగ్రామానికి చెందిన పూడూరు లచ్చన్న(46) ఉన్నఊర్లో ఉపాధిలేక జీవనోపాధి కోసం గల్ఫ్ దేశమైన దుబాయి వెళ్లాడు. అక్కడ ఉపాధి లేకపోవడంతో జీవితంపై విరక్తితో శుక్రవారం ఉదయం తన క్వార్టర్లోనే ఉరివేసుకుని మృతిచెందాడు. విషయాన్ని అక్కడితోటి కార్మికులు లచ్చన్న కుటుంబసభ్యులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. దీంతో కుటుంసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, మృతదేహాన్ని త్వరగా ఇంటికిచేరేలా చూడాలని బంధు వులు కోరుతున్నారు.

దుబాయ్‌లో గుండెపోటుతో యువకుడి మృతి


సిద్ధార్థ (ఫైల్)

ధర్మపురి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణానికి చెందిన కటుకం సిద్ధార్థ (19) అనే యువకుడు దుబాయ్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. జీవనోపాధి కోసం నెల రోజుల క్రితం సిద్ధార్థ దుబాయ్ వెళ్లాడు, అక్కడే తాత్కాలిక వేతనంపై ఏసీ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 10న పనిచేస్తున్న సమయంలో ఒక్కసారి కుప్పకూలిపోయాడు. వెంటనే ఆయనను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మృతుడి తండ్రి నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. తల్లి, చెల్లెతో కలిసి ఉంటున్న సమయంలో చిన్నతనంలోనే ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లి మృత్యువాత పడటం వల్ల ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


హరీశ్(ఫైల్)

తిమ్మాపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండల కేంద్రంలో ఇంటి వద్ద విద్యుత్‌వైర్లు తగిలి ఓ యువకుడు మృతి చెందాడు. ఎల్ఎండీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన న్యాలం హరీష్(35) శుక్రవారం ఇంటి ముందు నీళ్ల సంపు నుంచి నీళ్లు తోడుతుండగా ఆ సంపునకు ఉన్న మోటారుకు ఉన్న విద్యుత్‌వైరుతో విద్యుదాఘాతమై హరీష్ అక్కడే కుప్పకులాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో డాక్టర్ పరీక్షించి హరీష్ మృతిచెందినట్లు తెలిపారు. హరీష్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.



రక్తదానం... అపోహలు



రక్తదానంపై నేటికీ అనేక అపోహలు ఉన్నాయి. రక్తదానం చేస్తే బలహీన పడి, నీరసించి పోతారని చాలా మంది నమ్ముతారు. శ్రమతో కూడిన పనులు చేసుకునేవారు రక్తదానం చేస్తే వారు ఆ పనిచేయలేక పోతారని, రక్తదానం చేసే సమయంలో విపరీతమైన నొప్పి ఉంటుందని అనుకుంటారు. వ్యాధులు సోకే అవకాశం ఉంటుందనే అపోహ ఉంది. అయితే రక్తదానం తరువాత ఎలాంటి బలహీనత ఉండదని, ఆరోగ్యంగా ఉంటారని, శ్రమతో కూడిన కష్టమైన పనులు చేసుకునేవారు ఇంతకు ముందులా పనిచేసుకోవచ్చని డాక్టర్లు పేర్కొంటున్నారు. రక్తదానం చేసే సమయంలో ఎలాంటి నొప్పి ఉండదని, రక్తదానం చేయడంవల్ల ఎలాంటి వ్యాధులు సంక్రమించవని చెపుతున్నారు. ఆరోగ్యంగా ఉన్నవారు ఎవరైనా రక్తదానం చేయవచ్చు.

రక్తదానం.. ప్రాణదానం

- ఆపదలో ఉన్నవారికి అండ
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

సుభాష్‌నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రక్తదాత.. ప్రాణదాత అంటారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందించిన వ్యక్తి దేవుడితో సమానం. రక్తం అందక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ముఖ్యంగా ప్రమాదాలు జరిగినపుడు గాయపడిన వారికి తీవ్ర రక్తస్రావం అవుతుంది. అలాంటి వారికి అత్యవసరంగా రక్తం ఎక్కించాల్సి వస్తుంది. కానీ అది కృత్రిమంగా తయారు చేసేది కాదు. ఎవరైనా దాత ముందుకు వస్తేనే ఆ వ్యక్తి ప్రాణాలు నిలుస్తాయి. రక్తదానం ప్రజల్లో ఇప్పటికీ చాలా అపోహలు ఉండటంతో కొన్ని పరిస్థితుల్లో రక్తదాత దొరకడం కష్టంగా మారుతుంది. అపోహలతో చాలామంది రక్తదానం చేయడానికి ముందుకు రావడంలేదని డాక్టర్లు చెబుతున్నారు. 18 సంవత్సరాల వయస్సు నుంచి రక్తదానం చేయవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. రోగ నివారణ కోసం లేదా ప్రమాదాల సమయంలో బాధితుల శరీరంలో తగినంత రక్తం లేకపోతే మరొకరి నుంచి రక్తాన్ని సేకరిస్తారు. రక్తం తీసుకునే వ్యక్తిని రక్తగ్రహీత అని, ఇచ్చే వ్యక్తిని దాత అని అంటారు. ఓ గ్రూపు రక్తం కలిగినవారిరి విశ్వదాత అని, ఏబీ గ్రూపు రక్తం కలిగినవారిని విశ్వగ్రహీత అని అంటారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల ప్రజలకు రక్తం విలువను తెలియచేయాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడం వీలుకాదు. అయితే రక్తదాతలు ఎవరైనా రక్తాన్ని దానం చేసి, మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

1992 నుంచి రక్తదానం చేస్తున్నా

బేతి మహేందర్‌రెడ్డి, న్యాయవాది, బీజేపీ నాయకుడు




నాది ఓ నెగిటివ్ బ్లడ్ గ్రూపు. నేను 1992 నుంచి రక్తదానం చేస్తున్నా. ఇప్పటి వరకు 66 సార్లు రక్తదానం చేశాను. అంతే కాకుండా ప్లేట్‌లెట్స్, ప్లాస్మ కూడా దానం చేశాను. అత్యవసర సమయంలో రక్తం అందక చాలా మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. అపోహలు వీడి రక్తదానం చేయడానికి ముందుకు రావాలి. ముఖ్యంగా యువత రక్తదానం పట్ల అవగాహన కలిగి ఉండాలి. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి.

54 సార్లు రక్తదానం చేశా


గాలిపల్లి కుమార్, సామాజిక కార్యకర్త



నేను ఇప్పటి వరకు 54 సార్లు రక్తదానం చేశాను. అత్యవసర సమయంలో చాలామందికి కేవలం ఒక్క ఫోన్‌కాల్ చేస్తే చాలు వారు ఎక్కడ ఉన్నా రక్తదానం చేయడానికి వెళతాను. అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తదానం చేసి వారి ప్రాణాలను కాపాడ మనే సంతృప్తికి మించింది లేదు. అయితే చాలా మందికి రక్తదానం గురించి అపోహ ఉంది. అపోహను వీడి రక్త దానానికి ముందుకు రావాలి.



మరదలు అంత్యక్రియలకు వచ్చి.. కుప్పకూలిన బావ


పసుల కిషన్(ఫైల్)


నర్సవ్వ(ఫైల్)

వేములవాడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మరదలు అంత్యక్రియలకు వచ్చిన బావ కుప్పకూలి మృతిచెందిన సంఘటన వేములవాడ పట్టణంలో చోటుచేసుకుంది. గురువారం సాయినగర్‌లోని బోనాల వీధికి చెందిన కోల రామ్మూర్తి సోదరి నర్సవ్వ(56) అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న కరీంనగర్‌కు చెందిన మృతురాలి బావ(అక్క భర్త) పసుల కిషన్(73) వేములవాడ చేరుకున్నాడు. అంత్యక్రియలు పూర్తయిన తర్వాత ఇంటికి చేరుకున్న తరుణంలో బంధువులందరూ రోదిస్తుండగా ఓదార్చిన కిషన్ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. హుటాహుటిన బంధువులు స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా గుండెపోటుతో మృతిచెందాడని వైద్యులు పేర్కొన్నారని బంధువులు తెలిపారు. శుక్రవారం కిషన్ అంతిమ సంస్కారాలు కరీంనగర్‌లో నిర్వహించిన్నట్లు బంధువులు తెలిపారు. నర్సవ్వ అక్క సరోజన ఆరేళ్ల క్రితం మృతిచెందింది.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్‌క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం వెంకటయ్యపల్లిలో చోరీకేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారివద్ద నుంచి 33 తులాల బంగారు ఆభరణాలు, వెండి, 25వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలం వివరాలు వెల్లడించారు. వెంకటాయపల్లికి చెందిన ఉప్పుగండ్ల గంగారెడ్డి ఈ నెల8న తనఇంటికి తాళంవేసి తాగునీటిని తీసుకొచ్చేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని బంగారం, నగదు, వెండి చోరీ చేసినట్లు గుర్తించాడు. ఈ ఘటనపై బాధితుడు గంగాధర పోలీసులకు ఫిర్యాదుచేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సాంకేతికపరిజ్ఞానం ఉపయోగించి నిందితులను గుర్తించారు. మొత్తం ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ముగ్గురు ప్రత్యక్షంగా దొంగతనానికి పాల్పడగా ఇద్దరు దొంగిలించిన సొత్తులో కొంత బంగారాన్ని తక్కువ ధరకు కొన్నట్లుగా గుర్తించి వారిపై కూడా కేసు నమోదు చేశారు. ఐదుగురు నిందితుల్లో శుక్రవారం రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేటకు చెందిన గాజుల హేమంత్, కొమ్ము నవీన్‌ను పట్టుకున్నట్లు, ముగ్గురు పరారీలో ఉన్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా సీపీ రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్‌తోపాటు చొప్పదండి సీఐ ప్రదీప్ కుమార్, క్లూస్ టీం ఎస్సై రాజు, గంగాధర ఎస్సై వంశీకృష్ణ, సీసీఎస్ ఎస్సై నాగరాజును, కానిస్టేబుళ్లను అభినందించారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భార్యను స్నేహితుడి సహాయంతో హత్యచేసిన కేసులో ఇద్దరికి జీవిత ఖైదుతోపాటు ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున జరిమానా విధిస్తూ ఫస్ట్‌అడిషనల్, సెషన్స్‌జడ్జి నారాయణ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మోరపెల్లి శివారులోని చెరువులో గుర్తుతెలియని మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు గ్రామసెక్రెటరీ 2022లో జగిత్యాలరూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణజరిపి మల్యాల మండలం తాటిపెల్లి గ్రామానికిచెందిన అంజలి అనే మహిళగా గుర్తించారు. అంజలికి మానసిక ఆరోగ్యం సరిగా లేనందున భర్త కోట్ల రాజశేఖర్ భార్యను అడ్డుతొలగించేందుకు కుట్రపన్నాడు. 2022జూన్7న జగిత్యాలరూరల్ మండలం మోరపల్లి చెరువు దగ్గరికి తన భార్య అంజలిని తీసుకువచ్చిన రాజశేఖర్ తన స్నేహితుడు అడువాల సురేష్‌తోకలిసి కత్తితో గొంతుకోసి హత్యచేసి చెరువులో పడేశాడు. కేసుదర్యాప్తు చేసిన అప్పటి సీఐ కృష్ణకుమార్, ఎస్ఐఅనిల్ నిందితులు రాజశేఖర్, సురేష్‌పై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టుడ్యూటీ అధికారులు నరేష్, రాజు సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా అదనపు పబ్లిక్‌ప్రాసిక్యూటర్ మల్లేశం కేసు వాదించారు. నేరం రుజువుకావడంతో ఇద్దరు ముద్దాయిలకు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ముద్దాయిలకు శిక్ష పడడంలో కృషిచేసిన పోలీస్‌లను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారికి జరిమానా, శిక్ష

తిమ్మాపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో అనుమతులు లేకుండా అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తు పట్టుబడ్డ 13మంది వ్యక్తులకు లోక్‌అదాలత్‌లో భాగంగా మెజిస్ట్రేట్ ఎక్సైజ్‌కోర్టు జరిమానాతోపాటు శిక్షను కూడా ఖరారు చేస్తు శుక్రవారం ఉత్తర్వులు జారీచేసినట్లు ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఇందులో ఎలుక శ్రీధర్, ఎలుక సుమన్, గోనేల వంశీ, దుంబాల చందు, దుంబాల వెంకటేష్, బూడిద విజయ్, బొంగాని రమేష్, బోయిని సతీష్, మార్క శ్రీకాంత్, కనపర్తి చంద్రశేఖర్, కుంబాల శ్రీకాంత్, ఇనుకొండ సుధాకర్ రెడ్డి, బోనగిరి మధు మొత్తం 13మంది ఉన్నాట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో భాగంగా మెజిస్ట్రేట్ ఎక్సైజ్ కోర్టు పట్టుబడిన 13మంది వ్యక్తులకు ఒకొక్కరికి 8వేల రూపాయల జరిమానాతో పాటు వారివారి గ్రామ ప్రభుత్వపాఠశాలల్లో స్వచ్ఛభారత్ చేయాలని శిక్షను కూడా ఖరారు చేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

చిగురుమామిడి: మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేసిన ఏడుగురు వ్యక్తులకు రూ.8వేల చొప్పున జరిమానాతో పాటు మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో స్వచ్ఛభారత్ నిర్వహించాలని ఆదేశించినట్లు స్థానిక ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఒక్కొక్కరితో రెండు మొక్కలు నాటించాలని కూడా ఆదేశించినట్లు తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్/గణేష్‌నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడికరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లిజిల్లాలో డిగ్రీపాసైన అభ్యర్థులకు సివిల్‌సర్వీసెస్ ఉచిత శిక్షణకు బీసీ స్టడీసర్కిల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కరీంనగర్ జిల్లా బీసీస్టడీసర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ ఒకప్రకటనలో తెలిపారు.ఈనెల16నుంచి జూలై8లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్ పరీక్షద్వారా ఎంపికచేస్తామన్నారు. తరగతులు జూలై 25నుంచి 30ఏప్రిల్ 2026వరకు టీజీబీసీ స్టడీ సర్కిల్, లక్ష్మీనగర్‌కాలనీ, సైదాబాద్, హైదరాబాద్‌లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. 150మందికి శిక్షణఇస్తారని, వందమందిని జూలై12ననిర్వహించే ఆన్‌లైన్ స్క్రీనింగ్‌టెస్ట్ ద్వారా ఎంపికచేస్తారని, మరో50 మందిని గతంలో సివిల్‌సర్వీసెస్(ప్రిలిమ్స్) పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని ఎంపిక చేస్తారన్నారు. సంబంధిత పత్రాలతో టీజీబీసీ స్టడీ సర్కిల్,రోడ్‌నంబర్8, లక్ష్మీనగర్‌కాలనీ, సైదాబాద్, హైదరాబాద్‌లో అప్లైచేసుకోవా లన్నారు. అభ్యర్థులకులాడ్జింగ్,బోర్డింగ్, రవాణా కోసం నెలకురూ.5000స్టైఫండ్, రూ.5000 బుక్‌ఫండ్ ఒకసారి మాత్రమే ఇస్తారన్నారు. వివరాలకు 040-24071178నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

గుప్తనిధుల పేరిట నమ్మించి మోసం

- ఐదుగురు ముఠా సభ్యుల అరెస్టు
- నిందితుల వద్ద నుంచి 15.30 లక్షల నగదు, 3 కార్లు, 7 సెల్‌ఫోన్‌ల స్వాధీనం


నిందితులను అరెస్టు చూపుతున్న కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభంప్రకాశ్

కరీంనగర్ క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న నకిలీ బాబాలు ప్రత్యేక పూజలు చేసి గుప్తనిధులను బయటకు తీస్తేనే తల్లిదండ్రుల ఆరోగ్యం కుదురుకుంటుందని కొడుకును నమ్మించి 15.30 లక్షలరూపాయలు తీసుకుని మోసంచేసిన ఐదుగురు నకిలీ స్వాముల ముఠాను కొత్తపల్లి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ మేరకు కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్, సీఐ నిరంజన్‌రెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు.

కరీంనగర్ జిల్లా కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన గజ్జి ప్రవీణ్ (25) తండ్రి కనకయ్య, వేములవాడ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఒకప్రమాదంలో ఎడమ కాలు విరిగింది. అతని తల్లి కూడా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని, పదిరోజుల క్రితం స్వామివేషంలో ఉన్న ఒకవ్యక్తి గజ్జి ప్రవీణ్‌కు పరిచయమయ్యాడు. అతను ప్రవీణ్‌ఇంట్లో ఏమీ బాగాలేదని, ఇంటి పక్కనే క్వింటాల్ వరకు బంగారు కడ్డీ ఉందని, దానిని బయటకు తీసి పూజలు చేస్తే కుటుంబ సభ్యుల ఆరోగ్యం మెరుగుపడుతుందని, లేకపోతే మీ తండ్రి నెల రోజులలోపు చనిపోతాడని నమ్మించారు. అందుకు పూజలు చేయాలని, కావాల్సిన పూజా సామగ్రి కొనుగోలు చేయాలని మాయమాటలు చెప్పి విడతలవారీగా రూ. 15లక్షల 30 వేలు ప్రవీణ్ వద్ద వసూలు చేశాడు. డబ్బులు తీసుకున్న తర్వాత ఐదుగురు ముఠాసభ్యులు కొంత పూజా సామగ్రి కొనుగోలు చేసి, ఇంటి పక్కనే ఒకగొయ్యి తవ్వి, కుంకుమ, పసుపు చల్లి, అందులో నుంచి ఒక డబ్బా తీశారు. దానిలో కిలో బంగారం ఉంటుందని చెప్పి ప్రవీణ్ ఇంటిలోని దేవుడి గదిలో పెట్టించారు. ఇంకా డబ్బులు కావాలని బెదిరింపులకు పాల్పడ్డారు. లేకపోతే మీ నాన్నను ఇక్కడే చంపి పాతిపెడతాం అని బెదిరించారు. భయపడిన ప్రవీణ్, చుట్టుపక్కల వారి వద్ద నుంచి మరికొంత డబ్బు తీసుకొని వారికి ఇచ్చారు. ఈ విషయంపై గజ్జి ప్రవీణ్ కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టగా కరీంనగర్‌లోని చింతకుంట వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. చంద్రగిరి గ్రామానికి చెందిన ఈర్నాల రాజు, అగ్రహారం గ్రామానికి చెందిన మిరియాల దుర్గయ్య, చీర్లవంచ గ్రామానికి చెందిన పెనుగొండ రాజు, చల్లా అజయ్, ఈర్నాల సతీష్‌లని విచారణలో గుర్తించారు. వారు తాము చేసిన తప్పును ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి 15 లక్షల 30 వేల నగదు, 7 తులాల బంగారం, మూడు కార్లు, ఏడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ కేసును ఛేదించిన కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి, కరీంనగర్ రూరల్ ఎస్సై లక్ష్మారెడ్డిలను కరీంనగర్ కమిషనర్ గౌస్ ఆలం అభినందించారు. ఈ సందర్భంగా కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ మాట్లాడుతూ పూజలు చేస్తాం అంటూ వేషాలు వేసుకుని తిరిగే నకిలీ స్వాముల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మూఢ నమ్మకాలను విడనాడాలని సూచించారు. ఇటువంటి స్వామి వేషంలో మోసపోయిన ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రైలు కింద పడి మహిళ మృతి

అంతర్గాం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పెద్దంపేట రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు రైలు కింద పడి కొలిపాక రాజమణి(54)అనే మహిళ శుక్రవారం మృతి చెందింది. రామగుండం జీఆర్‌పీ ఇన్‌చార్జి తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం పెద్దంపేట గ్రామానికి చెందిన కొలిపాక రాజమణి గ్రామ శివారులోని చేన్లకు వ్యవసాయ పనులకు వెళ్ళింది. పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న క్రమంలో రైల్వే ప్లాట్ ఫాంపై ఆగి ఉన్న గూడ్స్ రైలుకింద నుంచి దాటడానికి ప్రయత్నించింది. ఈ క్రమంలో రైలు కదలడంతో రైలు కింద పడి మృతి చెందింది. సంఘటన స్థలాన్ని సందర్శించిన జీఆర్‌పీ పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే జీఆర్‌పీ పోలీసులు పేర్కొన్నారు. మృతురాలికి ముగ్గురు కూతుళ్లు, భర్త ఉన్నారు.

చెరువులో పడి పశువుల కాపరి మృతి


కొంరయ్య

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అల్లూరు చెరువులో ప్రమాదవశాత్తు అవుల కొంరయ్య(50) అనేపశువుల కాపరి పడి శుక్రవారం మృతిచెందాడు. అల్లూరు శివారు గంగిరెద్దులవాడలో నివసిస్తున్న కొంరయ్య పశువులను పెంచుతుంటాడు. గ్రామ శివారుతోపాటు చెరువు పరిసరాల్లో పశువులను మేపుతుంటాడు. శుక్రవారం చెరువులో దిగిన పశువులను బయటకు తీసుకువచ్చేందుకు కొంరయ్య చెరువులోకి దిగాడు. ప్రమాద వశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

గంభీరావుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం దమ్మన్నపేటకు చెందిన ఈరవేని భూమలింగం(50) జగదాంబ తండా సమీపాన శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. భూమలింగం గురువారం సాయంత్రం 4గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో వారి బంధువులు భూమలింగం కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. మరుసటి రోజు జగదాంబతండా సమీపాన భూమలింగం శవమై కనిపించాడు. అటుగావెళ్లే వారు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతోవారి కుటుంబసభ్యులు సంఘటన స్థలం వద్దకు వచ్చి రోదించారు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ ప్రేమానందం సిబ్బందితో వచ్చి సంఘటనస్థలాన్ని పరిశీలించారు. భూమలింగం ఇటీవల మద్యానికి బానిసైనట్టు, మద్యం మత్తులో కిందపడి మృతిచెంది ఉండవచ్చని బంధువులు ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా భూమలింగంను ఎవరో కొట్టడం వల్లే మృతిచెందాడని, ఒంటిపై గాయాలున్నాయని బంధువులు విలేకరులకు తెలిపారు. ఈవిషయమై ఎస్ఐ ప్రేమానందంను అడగా, అనుమానాస్పద మృతిగాభావిస్తూ భూమలింగం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

సీఎంను కలిసిన మంత్రి అడ్లూరి, ఎమ్మెల్యేలు


హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని సహచర మంత్రులు, సామాజిక వర్గం ఎమ్మెల్యేలతో కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

తిమ్మాపూర్/ధర్మపురి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గంలో కొత్తగాచేరిన మంత్రులు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని తననివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రివర్గంలో మాదిగ సామాజికవర్గానికి ప్రాధాన్యం కల్పించిన నేపథ్యంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అదే సామాజి కవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ (మానకొండూర్), మందుల సామేల్(తుంగతుర్తి), తోట లక్ష్మీకాంత రావు (జుక్కల్), కాలె యాదయ్య(చేవెళ్ల)తోపాటు పలువురు నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి పూలబొకే ఇచ్చి, శాలువకప్పి కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రివర్గంలో కొత్తగా చేరిన మంత్రి వాకిటి శ్రీహరి, మరో సీనియర్ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో నాలుగు రోజుల జైలు శిక్ష

జగిత్యాల క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలో పట్టణ పోలీసులు గురువారం వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతూ బోరగాళ్ల శేఖర్ అనే వ్యక్తి పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం జగిత్యాల కోర్టులో హాజరు పరిచారు. సెకండ్ అడిషనల్ స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ కేసు విచారించి నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు కోర్టు హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ రావు తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

కొడిమ్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్ గ్రామానికి చెందిన వొల్లాల తిరుపతిగౌడ్ తాటిచెట్టు పైనుంచిపడగా తీవ్రగాయాలపాలైనట్లు గ్రామస్థులు గురవారంతెలిపారు. చేతులు, భుజానికి, కాలుకు గాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. తాటి చెట్టు పైనుంచి పడి గాయాలపాలైన బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాల ని గౌడ సంఘం అధ్యక్షుడు చల్లూరి వెంకటేష్‌గౌడ్, సభ్యులు కోరారు.

రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి బదిలీ..

● ఇన్‌చార్జి ఈవోగా ఆర్డీవో రాధాబాయి



రాధాబాయి

వేములవాడ కల్చరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయఈవోగా విధులు నిర్వర్తిస్తున్న వినోద్‌రెడ్డిని బదిలీ చేస్తూ దేవాదాయశాఖ ఉత్తర్వులు శుక్రవారం విడుదల చేసింది. వినోద్‌రెడ్డిని దేవాదాయ శాఖ మల్టీజోనల్-2 డిప్యూటీకమిషనర్‌గా నియమించారు. వేములవాడ ఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తున్న రాధాబాయిని ఆలయ ఇన్‌చార్జి ఈవోగా నియమిస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

రాజన్నను దర్శించుకున్న ఇన్‌చార్జి ఈవో..

రాజన్న ఆలయ ఇన్‌చార్జి ఈవోగా నియమించడంతో రాధాబాయి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వర స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఏఈవో ప్రసాదాన్ని అందజేశారు. కాగా దేవాదాయ శాఖ మల్టీజోన్-2 డీసీగా బదిలీపై వెళుతున్న వినోద్‌రెడ్డి కుటుంబ సభ్యుతో కలిసి రాజన్నను దర్శించుకున్నారు. అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి స్వామివారి శేషవస్త్రంతో సన్మానించారు.

తప్పని దుమ్ము తిప్పలు

● నిత్యం వందలాది లారీలు

● ప్రజల ఇబ్బందులు



సుల్తానాబాద్‌లో దుమ్మురేపుతున్న మట్టి లారీలు

సుల్తానాబాద్, జూన్ 13 : (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణ ప్రజలకు మళ్లీ దుమ్ము తిప్పలు మొదలయ్యాయి. రెండేళ్ల నుంచి ఈ సమస్యతో ప్రజలు, ముఖ్యంగా ఈ రోడ్డును ఆనుకుని ఉన్న దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు నిర్మాణం పనుల ప్రారంభంతో కొన్ని నెలల పాటు ఉపశమనం లభించింది. ఇటీవల ఈ రోడ్డు నుంచి పెద్ద ఎత్తున భారీ టిప్పర్లు లారీలు రాకపోకలు సాగిస్తూ దుమ్ము రేపుతున్నాయి. ముఖ్యంగా మట్టి లారీలు వందల సంఖ్యలో వెలుతున్నాయని, దానికి తోడు ఇసుక లారీలు, గ్రానైట్ లారీలు, బియ్యం, ధాన్యం లారీలు, ఇసుక ట్రాక్టర్లు పెద్ద ఎత్తున నడుస్తుండటంతో వాటి వలన వెదజల్లుతున్న ధుమ్ము కారణంగా అనారోగ్యం పాల వుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుల్తానాబాద్ ఐబీ చౌరస్తా నుంచి కోర్టు, తహసీల్దార్, మండల పరిషత్, ప్రభుత్వ ఆసుపత్రి తదితర ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు, హాస్టల్స్ ఈ రోడ్డును ఆనుకునే ఉన్నాయి. ఆసెంబ్లీ ఎన్నికలు జరుగకముందు నుంచి ఈ రోడ్డు పై వాహనాల రాకపోకలతో దుమ్ము సమస్య ఏర్పడి పాదచారులు నడిచి వెళ్లలేని దుస్థితి నెలకొనేది. మళ్లీ గత కొన్ని రోజుల నుంచి అదే దుస్థితి ఏర్పడింది. సుల్తానాబాద్ మీదుగా వందలాది మట్టి లారీలు వెలుతుండడంతో విపరీతమైన దుమ్ము ప్రజలను దుకాణాలను కమ్మేస్తుంది. ముఖ్యంగా అతి భారీ వాహనాలు పద్నాలుగు టైర్ల లారీలు ఎక్కువగా వెలుతుండడంతో చట్టు పక్కల వైబ్రేషన్ కూడా ఏర్పడతుందని బాదితులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఈ మట్టి లారీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు రైలుబోగీల్లా, చీమలదండులా వరుసగా ఒకదానిని అనుకుని ఒకటి వెలుతుండడంతో ప్రజలు రోడ్డు దాటడానికి కూడా భయపడిపోతున్నారు. అధికారులు వెంటనే ఈ భారీ వాహనాల రాకపోకల మూలంగా దుమ్ము రేగకుండా రోడ్డు నిర్మాణ పనులు తొందరగా పూర్తి చేయించాలని కోరుతున్నారు.

చెరువుకట్టపై ముళ్ల పొదలు

● ఇబ్బందులు పడుతున్నరైతులు

కాల్వశ్రీరాంపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నీలకంఠ చెరువుకట్టపై తుమ్మలు పెరిగి దానిపై వెళ్లేందుకు రైతులు ఇబ్బం దులు పడుతున్నారు. చెరువుకట్ట హుస్సేన్‌మియావాగు దారి నుంచి పోలీస్ స్టేషన్ దారి వరకు సుమారు కిలోమీటర్ వరకు ఉంటుం ది. 90ఎకరాల విస్తీర్ణం ఉన్న నీలకంఠ చెరువుకట్ట కింద ఆయకట్టు సుమారు 200ఎకరాల వరకు ఉంటుంది. ప్రతిరోజు ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా రైతులు వ్యవసాయ పనులకు కట్టపై నుంచి వెళ్తుంటారు. పొలాల్లో ఎరువు వేయడానికి కట్టపై ముల్లపొదలు ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చెరువు కట్టపై రెండువైపులా తుమ్మ పొదలు అధికంగా ఉండడంతో ఇబ్బందులు పడుతూ వెళ్తున్నారు. గత ప్రభుత్వంలో చెరువుకట్టని వెడల్పు చేసి కట్టపైన సీసీ రోడ్డు వేయడంతో పాటు మినీ ట్యాంక్ బండ్ నిర్మిస్తామని చెప్పినా కార్యరూపం దాల్చలేదు. తుమ్మలు తొలగించి కట్టను వెడల్పు చేయాలని రైతులు కోరుతున్నారు.



కట్టపై దారికి అడ్డంగా పెరిగిన తుమ్మలు

మీ క్యూట్ చిల్డ్రన్

● కలెక్టర్ స్టేటస్‌లో గర్షకుర్తి, వెంకటయ్యపల్లి విద్యార్థుల ఫొటోలు



కలెక్టర్ స్టేటస్‌లోని వెంకటయ్యపల్లి విద్యార్థుల ఫొటో

గంగాధర, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మీ క్యూట్ చిల్డ్రన్ అంటూ కలెక్టర్ పమేలాసత్పతి గంగాధరమండలం గర్షకుర్తి, వెంకటయ్యపల్లి ఎంపీయూపిఎస్ విద్యార్థులఫోటోలు తనస్టేటస్‌లో పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటయ్యపల్లి, గర్షకుర్తి పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈసందర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో జిల్లాలోని వివిధశాఖ అధికారులతో పాటు కలెక్టర్, అదనపుకలెక్టర్లు సభ్యులుగా ఉన్నారు. అయితేజిల్లాలో ఎంఈవోలు విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలాల్లో చేపట్టిన కార్యక్రమాల వివరాలతోపాటు ఫొటోలను అప్‌లోడ్‌చేస్తారు. శుక్రవారం మండలంలోని రెండు పాఠశాలల్లో చేపట్టిన కార్యక్రమాలతోపాటు ఫొటోలను ఎంఈవో ప్రభాకర్‌రావు జిలా గ్రూప్‌నకు పంపించారు. ఈ సందర్భంగా వాటిని గమనించిన కలెక్టర్ గర్షకుర్తి, వెంకటయ్యపల్లిలోని చిన్నారుల ఫొటోలను తనస్టేటస్‌గా పెట్టుకున్నారు. అందులో మైక్యూట్ చిల్డ్రన్ అని సంబోధించిన వ్యాఖ్యాలు మండలంలోని ఉపాధ్యాయులకు ఉత్సాహాన్ని నింపాయి. తాము విద్యార్థులకు చేస్తున్న బోధనలకు కలెక్టర్ మేడం స్టేటస్ రూపంలో ప్రోత్సాహం చూపడంతో ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. దీంతో మరింత బాధ్యతగా విద్యార్థుల భవిష్యత్తుకు బాటలువేస్తూ సర్కారుబడి నాణ్యమైన విద్యపై తల్లిదండ్రులకు వివరించి విద్యార్థుల సంఖ్యను పెంచుతామని అన్నారు.

ఎస్సారెస్పీకి స్వల్పంగా పెరిగిన వరద

● ప్రాజెక్టులోకి 3,314 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరుగుతోంది. శుక్రవారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఎస్సారెస్పీలోకి 3,314 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 సామర్థ్యంకు గానూ ప్రస్తుతం 13.601 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యమివ్వాలి

● కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ



రైతుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

వేములవాడ కల్చరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాజన్న ఆలయ గోశాలలోని కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధానత్యను ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూ అన్నారు. తిప్పాపూర్ గోశాలలో శుక్రవారం 100 కోడెలను అర్హులైన రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసుకున్న రైతుల ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు 375జతల కోడెలు(750 కోడెలు) రైతులకు పంపిణీ చేశామన్నారు. గోశాలనుంచి పంపిణీ చేసిన కోడెలను వ్యవసాయ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని సూచించారు. కోడెలు పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాజన్న కోడెలపై ప్రత్యేక శ్రద్ధపెట్టి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి ఉన్నారు.

హక్కుల కోసం యాదవులు ఉద్యమించాలి

● యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్



నియామకపత్రం అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌యాదవ్

సిరిసిల్ల టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : యాదవులు అన్ని రంగాల్లో హక్కుల కోసం ఉద్యమించాలని యాదవవిద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని ఓ ప్రైవేటుపాఠశాలలో యాదవ విద్యావంతుల వేదిక జిల్లా కార్యవర్గం సమావేశంలో జిల్లా నూతనకార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ మాట్లాడారు. ప్రస్తుతం యాదవులు అన్ని రంగాల్లో వివక్షతను ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యా, ఉద్యోగరంగాలతో పాటు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో జనాభానిష్పత్తి ప్రకారం వాటాల కోసం రాజకీయ సామాజిక చైతన్యం కోసం ముందుకు సాగాలన్నారు. యాదవజాతి రాజకీయ రంగంలోకూడా వాటా సాధించాలంటే ఐకమత్యం అనే చైతన్యం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు. సంఘం భవిష్యత్తు కార్యక్రమాలకోసం జిల్లా నూతనకార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. జిల్లాఅధ్యక్షుడు బొబ్బల మల్లేష్‌యాదవ్, ప్రధానకార్యదర్శి బత్తుల మహేందర్‌యాదవ్, న్యాయవిభాగం అధ్యక్షురాలు యమునాయాదవ్, రాష్ట్ర కార్యదర్శి జగ్గాని మల్లేష్‌యాదవ్, జిల్లా గౌరవ సలహాదారులుగా శ్రీనివాస్‌యాదవ్, తోట్ల రాములుయాదవ్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. నూతన కార్యవర్గం సభ్యులకు నియామక పత్రాలను రాష్ట్రఅధ్యక్షుడు వెంకట్‌యాదవ్ అందించి అభినందించారు. కార్యక్రమంలో గొర్రెలకాపరుల సంక్షేమసంఘం రాష్ట్రఅధ్యక్షుడు పోచబోయిన శ్రీహరియాదవ్, రాష్ట్ర కార్యదర్శి వీరవేణి మల్లేష్‌యాదవ్, యాదవ కుల సంఘం నాయకులు యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ.. ఒకరి మృతి

శంకరపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్‌శివారులో శుక్రవారం రెండుద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన చింతిరెడ్డి లింగారెడ్డి (58) వ్యక్తిగత అవసరాల రీత్యా కేశవపట్నంకువెళ్లి తిరిగి ఇంటికివస్తున్నాడు. ఈక్రమంలో మొలంగూర్‌కు చేరుకోగానే ఆగ్రామానికి చెందిన కనకంతిరుపతి తన ద్విచక్రవాహనంపై వేగంగావస్తూ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో చింతిరెడ్డి లింగారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108సిబ్బంది క్షతగాత్రుడిని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు విద్యాసాగర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

పేదలకు అండగా ఉంటాం..

● ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల ఇళ్లు ఇస్తాం.. ● జిల్లాకు బఫర్ కింద మరో వెయ్యి ఇందిరమ్మ ఇళ్లు

● అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి నిధులు

● రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలు ఇస్తున్న మంత్రులు

పెద్దపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేటప్పుడు, ఏ కులం, ఏ మతం అని చూడలేదు.. పేదోడైతే చాలనుకున్నాం.. ఈ ఐదేళ్లలో ఇరవై లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి తీరతామని, చివరకు పింకు షర్టు తొడుక్కున్న వాళ్లకు కూడా ఇళ్లు ఇస్తామని, తల తాకట్టు పెట్టయినా పేదలకు ఇందిరమ్మ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్‌శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ఎలిగేడు, పెద్దపల్లి రూరల్, మహిళా, ట్రాఫిక్ నూతన పోలీస్ స్టేషన్ల ఆరంభం, పెద్దపల్లి పట్టణంలో రూ.4.25 కోట్లతో నిర్మించనున్న సమీకృత కూరగాయల మార్కెట్‌కు శంకుస్థాపనచేసి చందపల్లి, రాంపెల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూముల ఇళ్లను ప్రారంభించారు. అనంతరం చందపల్లిలో జరిగిన బహిరంగసభలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వాడికి అండగా ఉంటూ ఇందిరమ్మ పాలనను చూసి ఓర్వలేని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కళ్లుండి కబోదిలా మారారని, సన్నబియ్యంలో పురుగులు వస్తున్నాయని విమర్శిస్తున్నారని, ఇక్కడ ఓ చెల్లెమ్మను సన్నబియ్యంలో పురుగులున్నాయని అంటున్నారని అడిగేతే.. వాళ్ల నోట్లో పురుగులు పడ.. బియ్యంలో ఎక్కడ పురుగులున్నాయని చెప్పారని ఎదురు ప్రశ్నించిందని అన్నారు. అందరితో సమానంగా పేదల కడుపు నింపామని అంటూ ఆ మహిళ సమాధానంతో నా కళ్లల్లో నీళ్లు తిరిగాయని అన్నారు. కల్లబొల్లి మాటలు చెప్పి, ప్రజలను మోసం చేసి పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ పార్టీ ప్రజలకు వెలగబెట్టిందేమి లేదని, 8లక్షల19కోట్లరూపాయల అప్పులు చేశారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదలకు అండగా ఉండేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లను చేపట్టాలని, ఇందుకు 22,500 కోట్లనిధులు ప్రభుత్వం కేటాయించిందన్నారు. రాష్ట్రంలో 20లక్షల ఇళ్లు మంజూరు చేసి తీరతామని అన్నారు. నాటి ప్రభుత్వం అర్ధంతరంగా వదిలేసిన డబుల్ బెడ్‌రూముల ఇళ్లను పూర్తిచేసి ఇస్తున్నామన్నారు. దేశచరిత్రలోనే సన్నబియ్యం అందిస్తున్న చరిత్ర ఏ రాష్ట్రానికి లేదన్నారు. సన్నవడ్లకు 500 బోనస్ ఇస్తున్నామని, 21కోట్ల రూపాయల వరకు రైతులకు ఏకకాలంలో 2లక్షల రూపాయల వరకు రుణ మాఫీ చేశామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ధరణి వల్ల తమ భూములపై భరోసా లేకుండా చేసింది. దానిస్థానంలో భూభారతిచట్టాన్ని తీసుక వచ్చామని, రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 70శాతంవరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయని మంత్రి అన్నారు.

● సన్నబియ్యంతో కుటుంబానికి నెలకు రూ. 2 వేల వరకు ఆదా

ఎన్నికల సందర్భంగా సన్నబియ్యం ఇస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని రాష్ట్రఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ప్రతి నెలా ఒక్కో కుటుంబానికి సన్నబియ్యంతో 2వేల రూపాయల వరకు ఆదా అవుతున్నాయన్నారు. ఆయకట్టు చివరి ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఇందిరమ్మ కమిటీ ఏర్పాటు చేసి పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామన్నారు. అర్హత ఉండి ఇండ్లు రాని వారు ఆందోళన చెందవద్దని, రాబోయే దశలలో మరిన్ని ఇండ్లు మంజూరు అవుతాయని అన్నారు. గత ప్రభుత్వం మధ్యలో వదిలిపెట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కూడా 6కోట్ల రూపాయలతో తాగునీరు, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతులు పూర్తిచేస్తామన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నదని అన్నారు.

కలెక్టర్ కోయశ్రీహర్ష, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్, డీసీపీ కరుణాకర్, అదనపు కలెక్టర్లు డి వేణు, జే అరుణశ్రీ, పెద్దపల్లి ఆర్డీఓ బి గంగయ్య, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, పెద్దపల్లి, సుల్తానాబాద్ మార్కెట్ కమిటీల చైర్మన్లు ఈర్ల స్వరూప, మినుపాల ప్రకాశ్ రావు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

సమాజాన్ని కాపాడేది కమ్యూనిస్టులే

● ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి ● సీపీఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న సీపీఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివరావు

జగిత్యాల అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని కాపాడేది సైనికులైతే సమాజాన్ని కాపాడేది కమ్యూనిస్టులేనని.. దేశంలో ఎర్రజెండా లేకుండా చేయడం ప్రధాని మోదీ కాదని సీపీఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో సీపీఐ జిల్లా నాలుగో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు హాజరై మాట్లాడారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని దేశం అంతర్గత ప్రమాదంలో పడిందన్నారు. కమ్యూనిస్టులు బలపడితే దేశం బలపడుతుందన్నారు. ప్రజల కష్టానికి ప్రతిఫలం లభించడంలేదని, దేశసంపద కొందరి చేతుల్లోనే ఉందని, అంబాని, ఆదాని టాటా, బిర్లావంటి పెట్టుబడిదారుల గత్తాదిపత్యంలో ఉందని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ దళారుల కొమ్ము కాస్తున్నారన్నారు. 11సంవత్సరాల పాలనలో దేశంలో పేదరికం పోయిందని కేవలం ఐదు శాతం మాత్రమే పేదలు ఉన్నారని ప్రపంచ బ్యాంక్ అంచనా వేయడం చూస్తుంటే ఇవి బూర్జువా పార్టీలకు కొమ్ముకాస్తున్నాయనే విషయం స్పష్టం అవుతుందన్నారు. పేదలకోసం జైలుకు వెళ్లినచరిత్ర సీపీఐకి ఉందన్నారు. స్వరాజ్యం సిద్ధించి 78ఏళ్ళు అయినా ఇంక రేషన్ కార్డులు ఎందుకని ఆయన ప్రశ్నించారు. మావోయిస్టులను చంపవద్దని ఆపరేషన్ కాగార్‌ను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో అన్నాదమ్ముల్లాగా కలిసి ఉంటున్న ప్రజలను మతం పేరుతో చిచ్చుపెట్టి బీజేపీ పబ్బం గడుపుకుంటోందని విమర్శించారు. దేశాన్ని కాపాడేది సైనికులైతే సమాజాన్ని కాపాడేది కమ్యూనిస్టులేనని అన్నారు.

మావోయిస్టులతో చర్చలు జరపాలి..

చిగురుమామిడి: కేంద్రప్రభుత్వం మావోయిస్టులపై నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని రేకొండలో విలేకరులతో మాట్లాడుతూ మావోయిస్టులను కాల్చి చంపడం అప్రజాస్వామిక చర్య అని అన్నారు. కాళేశ్వర విచారణలో అధికారులను బలి చేసే కుట్ర జరుగుతోందన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి ప్రాజెక్టులో జరిగిన అన్ని విషయాలను రాష్ట్ర ప్రజలకు తెలియపరచాలని అన్నారు. 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సీపీఐ పార్టీ ఉత్సవాలను డిసెంబరు వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్నిగ్రామాల్లో ఉత్సవాలు జరుపుతామని అన్నారు. ఉత్సవాల ముగింపు బహిరంగా సభ కొత్తగూడెంలో 5లక్షలతో మందితో నిర్వహిస్తామని అన్నారు. కమ్యూనిస్టు పార్టీకి కంచుకోటగా ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని మండలాల్లో విజయం సాధించాలని అన్నారు.

పరామర్శ..

చిగురుమామిడిమండలంలోని రేకొండలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు చాడ శోభ కుటుంబ సభ్యులను కూనంనేని సాంబశివరావు పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి జోహర్లు అర్పించారు.

దోపిడీ ఉన్నంతకాలం.. ఎర్రజెండా ఉంటది..

జగిత్యాల (ఆంధ్రజ్యోతి): దోపిడీ ఉన్నంత కాలం ఎర్రజెండా ఉంటుందని సీపీఐ జాతీయకార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లాకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సీపీఐ 4వ మహాసభకు ఆయన హాజరై, ప్రజాప్రదర్శన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అంతరాలులేని సమాజం కోసమే ఎర్రజెండా పుట్టిందన్నారు. దేశంలో మతోన్మాదం పెరిగిపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కగార్ పేరుతో మావోయిస్టులను కాల్చిచంపుతున్నారని, ఈ దుశ్చర్యను తక్షణమే ఆపాలన్నారు. ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వెన్న సురేష్, నాయకులు వెన్న మహేష్, కొక్కుల శాంత, జిల్లాలోని వివిధ అనుబంధ సంఘాల నాయకులు, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

బెస్ట్ ఫిలిం క్రిటిక్ గద్దర్ అవార్డుకు పొన్నం రవిచంద్ర ఎంపిక

● నేడు సీఎం రేవంత్ చేతుల మీదుగా స్వీకరణ



డాక్టర్ పొన్నం రవిచంద్ర

కరీంనగర్ కల్చరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినిమా విమర్శలో తనదైన ముద్ర వేసి, సినీ రంగంపై అనేక వ్యాసా లు, పుస్తకాలురాసి, డాక్యుమెంటరీలు నిర్మించిన కరీంనగర్‌కు చెందిన డాక్టర్‌పొన్నం రవిచంద్రను రాష్ట్రప్రభుత్వం తొలిసారిగా గద్దర్‌పేరిట ఇస్తున్న అవార్డులలో భాగంగా 2024సంవత్సరానికి బెస్ట్ ఫిలిం క్రిటిక్ గద్దర్ అవార్డు వరించింది. కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షునిగా కొనసాగుతున్న ఆయన సినీ ప్రస్థానం ఎంతో విశిష్టమైంది. కరీంనగర్‌కు చెందిన బాలీవుడ్ నటుడు పైడి జయరాజ్‌ను లోకానికి పరిచయం చేయాలని ముంబై వెళ్లి జయరాజ్ బంధువులను కలుసుకొని వివరాలు, ఫొటోలు సేకరించి డాక్యుమెంటరీ నిర్మించారు. దీనికి అవార్డు కూడా వచ్చింది. అలాగే రావూరి భరద్వాజ, శతాబ్దిచిత్రం, దేశభక్తి సినిమాలు, సర్దార్ సర్వాయి పాపన్న, భూమిపుత్రుడు వంటి అంశాలపై డాక్యు మెంటరీలు నిర్మించారు. సీనియర్ జర్నలిస్టుగా, సినీ విమర్శకుడిగా, రచయితగా బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఆయన పలుపత్రికలకు వ్యాసాలు రాశారు. 80ఏళ్ల తెలుగుసినీ ప్రస్థానంపై రాసిన ప్రస్థానం పుస్తకానికి ఏపీ ప్రభుత్వం నంది అవార్డు అందజేసింది. కరీంనగర్ జిల్లాఏర్పడి వందేళ్లు అయిన సందర్భంగా శతవసంతాల కరీంనగర్ పేరుతో రచించిన పుస్తకం ఎంతో గుర్తింపు పొందింది. అవార్డు దక్కడం పట్ల మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విశ్వవిద్యాలయాల జాయింట్ సెక్రెటరీ జీవి శ్యాంప్రసాద్‌లాల్, కఫిసొ బాధ్యులు లక్ష్మీగౌతమ్, మాడిశెట్టి గోపాల్, అన్నవరం దేవేందర్ తదితరులు అభినందనలు తెలిపారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

ఇల్లంతకుంట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంగమరెడ్డిపల్లె గ్రామానికి చెందిన పందుగు చక్రపాణి (43) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కొంతకాలంగా భార్య, తల్లితో విభేదాలు నడుస్తున్నాయి. పెద్దల సమక్షంలో పలుసార్లు పంచాయితీలు జరిగాయి. కుటుంబ కలహాలతో మనస్థాపం చెందిన చక్రపాణి గురువారం క్రిమిసంహారక మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి అన్న అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు చోరీ

జగిత్యాల క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని అరవింద్ నగర్, బంజరు దొడ్డి ప్రాంతాల్లో ఇంటి ఎదుట నిలిపి ఉన్న రెండు ద్విచక్ర వాహనాలు ఇటీవల చోరీకి గురయ్యాయి. బాధితులు రాజ్‌కుమార్, వసంత్‌రావు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్సై గీత కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

కోరుట్ల రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంగెం గ్రామానికి చెందిన సారపు రాజవ్వ (68) అనే వృద్ధురాలు శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఇంట్లో తరుచూ గొడవలు జరుగుతుండడంతో మనస్తాపం చెందింది. శుక్రవారం మధ్యాహ్నం భర్త వెంకటి రేషన్ బియ్యం తేవడానికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు రాజవ్వ కూతురు వెంకవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ-2 రామచంద్రుడు తెలిపారు. సంఘటన స్థలాన్ని కోరుట్ల సీఐ సురేష్ బాబు, ఎస్ఐ శ్రీకాంత్ పరిశీలించారు.

కొడుకుతోసహా తల్లి అదృశ్యం

కొడిమ్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపేట గ్రామానికి చెందిన బానాల మౌనిక, చిన్న కుమారుడు రాంచరణ్ కనిపించడంలేదని మౌనిక భర్త రాకేష్ ఫిర్యాదు చేసినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు ఈ నెల 12 మౌనిక ఆమె అమ్మ గారి ఊరైన స్టేషన్‌ఘన్‌పూర్‌కు వెళ్తున్నానని చెప్పి మళ్లీ రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి: డీఈవో

మల్లాపూర్, జూన్, 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీఈవో రామునాయక్ ఆకాంక్షించారు. మండలంలోని హుస్సేన్‌నగర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన మండల విద్యాధికారి దామోదర్‌తో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి తొలి మెట్టు ముఖ్యమని, దీనిలో భాగంగా అక్షరాభ్యానికి ప్రాధాన్యం ఉందన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి మహేష్, ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పెగడపల్లి: మండలంలోని బతికెపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయురాలు అల్లాడి భారతి, హెచ్ఎం రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఆనందరెడ్డి, తిరుపతి, మహిపాల్‌రెడ్డి, జరీనాబేగం, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి పాల్గొన్నారు.

ధర్మపురి: మండలంలోని రామయ్యపల్లె, ఇప్పలపల్లె ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో సీతాలక్ష్మి, కాంప్లెక్స్ హెచ్ఎం మురళి, పాఠశాల హెచ్ఎంలు దాసరి భీమయ్య, మల్లేశం, ఏపీసీ చైర్‌పర్సన్‌లు కలమడుగు లక్ష్మి, సౌందర్య, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు రాందేని మొగిలి, టీచర్లు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని ధర్మపురి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం పెండ్యాల మహేందర్ అన్నారు. ధర్మపురి మండలంలోని గిరిజన గ్రామమైన దుబ్బలగూడెం, చిన్ననక్కలపేట గ్రామాల్లో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.. టీచర్లు కాసర్ల నరసింహమూర్తి, వంశీకృష్ణ, కవిత, కాశెట్టి శారత, ఉమారాణి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.




హుస్సేన్‌నగర్‌లో అక్షరాభ్యాసం చేయిస్తున్న డీఈవో రామునాయక్, దుబ్బలగూడెంలో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లె ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి, గ్రామ ప్రత్యేకాధికారి సుష్మా, ప్రధానోపాధ్యాయుడు కడకుంట్ల అభయ్ రాజ్, ఉపాధ్యాయులు బెజ్జంకి హరికృష్ణ, కడకుంట్ల వినోద్, పంచాయతీ సెక్రటరీ రాజేష్, అంగన్‌వాడీ కార్యకర్త పద్మావతి, కారోబార్ రాజేందర్ పాల్గొన్నారు.

బీర్‌పూర్: మండలంలోని తుంగూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని చేయించారు. కార్యక్రమంలో ధర్మపురి సీడీపీవో వాణిశ్రీ, మండల విద్యాధికారి నాగభూషణం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శైలజ, పాఠశాల ఉపాధ్యాయులు హేమలత, రజిత, జనార్దన్, నారాయణరెడ్డి, అక్షయ్ పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ..

కథలాపూర్: మండలంలోని పోతారం పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలను ఏఎంసీ వైస్‌చైర్‌పర్సన్ పులి శిరీషహరి ప్రసాద్ పంపిణీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ లావణ్య, హెచ్ఎం శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు

వెల్గటూర్: మండలంలోని ముక్కట్రావ్‌పేట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు యూనిఫాంలు అందజేశారు. ఎంపీడీవో వెంకటేశ్వర్ రావు, ఏఎంసీ చైర్మన్ గుండాటి గోపిక జితేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేంధర్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ గొల్ల తిరుపతి, పాల్గొన్నారు.

ఏడాదిన్నరగా ఎదురుచూపులు

(5వ పేజీ తరువాయి)

స్పష్టంగా పేర్కొంది. అర్హులైన ప్రతీ కౌలు రైతుకు ఏడాదికి 15,000 వేల రూపాయల సహాయం అందిస్తారని ఆశపడ్డారు. ఆశలు ఇప్పటివరకు నెరవేరలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కౌలు సహాయం అందుతుందని రైతులు భావించినప్పటికీ నిరాశే మిగిలిపోయింది. మూడు సీజన్లు గడుస్తున్నప్పటికీ కౌలు రైతులను ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు.

కౌలు రైతులకు భరోసా కల్పించాలి..

- మారం సతీష్, కౌలు రైతు, బట్టపల్లి, సారంగాపూర్ మండలం



ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకొని భరోసా కల్పించాలి. ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని పంట సాగు చేస్తే అప్పుల పాలు కావాల్సి వస్తోంది. తప్ప రూపాయి మిగిలింది లేదు. ఓ పక్క పెరిగిన కౌలు, మరో పక్క విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులకు అధిక ధరలు ఉండటంతో పెట్టుబడుల కోసం నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఐదెకరాలు కౌలు చేస్తున్నా...

- జల్లిక ఎల్లయ్య, కౌలు రైతు, మారేడుపల్లి, ఎండపల్లి మండలం



ఐదెకరాలు కౌలుకు తీసుకొని పంట పండిస్తున్నా. గుంట భూమి సొంతం లేకున్నప్పటికీ వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నా. కౌలు రైతులకు పెట్టుబడి సాయం సర్కారు అందిస్తుందని ఆశిస్తున్నాను. వానాకాలం సీజన్‌లోనైనా ప్రభుత్వం కౌలు రైతులకు సాయం అందించే ప్రక్రియ ప్రారంభించాలి.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవు

- భాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



కౌలు రైతులకు సంబంధించిన పెట్టుబడి సాయం గురించి ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఆదేశాలు రాలేదు. ప్రస్తుతం రైతులు సాగుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ ద్వారా పలు సూచనలు, సలహాలు అందజేస్తున్నాం. రైతులు నకిలీ విత్తనాల బారినపడి మోసపోకుండా తగు చర్యలు తీసుకుంటున్నాము.

భూ భారతి గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

కొడిమ్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): భూ భారతి గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత సూచించారు. శుక్రవారం మండలంలోని గౌరాపూర్ గ్రామంలో జరుగుతున్న భూ భారతి గ్రామసభను అదనపు కలెక్టర్ సందర్శించారు. రైతుల, భూ యజమానుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సభలో ప్రజల నుంచి 71 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఎం కిరణ్‌కుమార్ తెలిపారు. గ్రామసభలో ఆర్ఐ కరుణాకర్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని మూటపెల్లి గ్రామంలో శుక్రవారం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జున ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

ధర్మపురి: మండలంలోని జైనాలో భూ భారతి రెవెన్యూ సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి మండల ఇన్‌చార్జి తహసీల్దార్ సుమన్ భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీనివాస్‌యాదవ్, భాస్కర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ అనిల్, సర్వేయర్ పరమేశ్వర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్ పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

మెట్‌పల్లి రూరల్: మండల ప్రజా పరిషత్ పాత సమావేశ మందిరంలో తహసీల్దార్ శ్రీనివాస్‌తో పాటు డీటీ అబ్దుల్ ఖాదిర్, ఆర్ఐలు కాంతయ్య, ఉమేష్‌లు నిర్వహించిన రెవెన్యూ సదుస్సులో 85 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ సదస్సును ఆర్డీవో శ్రీనివాస్ సందర్శించి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, పూర్తి రికార్డుల ఆధారంగానే వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, మాజీ కౌన్సిలర్లు యామ రాజయ్య, ఎర్రల హనుమంతు, జెట్టి లక్ష్మణ్, పుల్లూరు వెంకటేష్, బొడ్ల ఆనంద్ పాల్గొన్నారు.

మల్లాపూర్: ఈనెల 3 నుంచి శుక్రవారం వరకు గ్రామాల వారీగా జరిగిన భూ భారతి సదస్సుల్లో 924 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ రమేష్ తెలిపారు. చివరి రోజు మండలంలోని గుండంపల్లి, రత్నాపూర్ రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలపూర్‌లో తహసీల్దార్ కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో భూ భారతి రెవ్యూన్యూ సదస్సు నిర్వహించగా మార్కెట్ కమిటి చైర్మెన్ పన్నాల అంజిరెడ్డి సందర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఫారూర్, ఆర్ఐ రాజేందర్‌రావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టీజేఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి

పెగడపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ధర్మపురి నియోజకవర్గ తెలంగాణ జన సమితి నియోజకవర్గ ఇంచార్జి రామగిరి సంతోష్ శుక్రవారం హైదరాబాద్‌లో కలసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. టీజేఎస్ నాయకులు మెడపట్ల రాజేష్, ఎదుల్ల సంజీవ్‌కుమార్ ఉన్నారు.

ఉపాధ్యాయుల ఆర్థిక సహాయం

రాయికల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికురాలు పడాల శాంతమ్మ (50) క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఇటిక్యాల ఉన్నత పాఠశాల ప్రస్తుత, పూర్వ ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు కలిసి 21,000 రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సీమల దారి సదాశివ్, ఆర్‌యూపీపీ రాష్ట్ర శాఖ సహాధ్యక్షుడు వేల్పుల స్వామి యాదవ్, పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి గాజెంగి రాజేశం పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామంగా మార్పు చేయాలి

మల్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపేటను రెవెన్యూ గ్రామంగా మార్చాలంటూ గ్రామస్థులు జగిత్యాల ఆర్డీవో మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా రామన్నపేటలో నిర్వహిస్తున్న గ్రామసభలో ఆర్డీవో పాల్గొనగా రెవెన్యూ గ్రామంగా లేకపోవడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. నూకపల్లి రెవెన్యూ గ్రామంలో రామన్నపేట ఉండడంతో సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. పలు విషయాల్లో రెండు గ్రామాల మధ్య సమస్యలు వస్తున్నందున రామన్నపేటను రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో కలెక్టర్ దృష్టికి సమస్య తీసుకెళతానని ఈ సందర్భంగా ఆర్డీవో తెలిపారు. నేరెళ్ల సతీష్‌రెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, గడ్డం మల్లారెడ్డి, కిషన్‌రెడ్డి, తిరుపతి, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రాథమికోన్నత పాఠశాల ఏర్పాటు చేయాలి

జగిత్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని నూకపల్లి అర్బన్ హౌజింగ్ కాలనీలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఏర్పాటు చేయాలని కోరుతూ కలెక్టర్ సత్య ప్రసాద్‌కు మాజీమంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి శుక్రవారం లేఖను రాశారు. ప్రస్తుతం కొన్ని కుటుంబాలు జగిత్యాల నుంచి నూకపల్లి అర్బన్ కాలనీకి షిఫ్ట్ అవుతున్న నేపథ్యంలో పిల్లల చదువుల కోసం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

రాయికల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించి ఎరువుల విక్రయాలు జరిపితే వారిపై చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్ హెచ్చరించారు. రాయికల్ మండల కేంద్రంలో శుక్రవారం వివిధ దుకాణాలను తనిఖీ చేసి యాజమానులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ దుకాణాల్లో స్టాక్ బోర్డు ఏర్పాటు చేసి ఎరువుల క్రయ,విక్రయాల వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఎమ్మార్పీ ధరలకు మించి ఎరువులను అమ్మరాదని అన్నారు. రైతులకు కొనుగోలు రశీదును ఫామ్-ఎం రూపకంగా ఇవ్వాలని, ఎరువుల అమ్మకాలను ఈ-పాస్, బయోమెట్రిక్ పద్ధతిన విక్రయాలు జరపాలని సూచించారు.

విమాన ప్రమాద ఘటనపై సంతాపం

రాయికల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో చోటు చేసుకున్న విమాన ప్రమాద ఘటనపై రాయికల్ పట్టణ మైనార్టీ నాయకులు శుక్రవారం సంతాపం తెలిపారు. వారి ఆత్మ శాంతి కలిగేలా మౌనం పాటించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షాకీర్, మహ్మద్ అబ్దుల్ అస్లాం, మహ్మద్ సాబీర్, మదీనా, మసీద్ ఆఫీస్ సబ్ సద్దాం హుస్సేన్, ఇర్ఫాన్, అలీ మహ్మద్, షాకీర్, అమీర్, అల్మాస్ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: అహ్మదాబాదులో జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి పట్టణంలోని గడి పాఠశాల విద్యార్థులు ఘన నివాళి అర్పించారు. ఈ ప్రదానోపాధ్యాయుడు సునావత్ రాజు, ఉపాధ్యాయులు సురేధర్, సురేఖ, దనలక్ష్మి, సుమలత పాల్గొన్నారు.

టీఎన్‌జీవో వెటర్నరీ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా ఆనంద్



టీఎన్‌జీవో వెటర్నరీ ఫోరం జిల్లా కార్యవర్గ సభ్యులు

సారంగాపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌జీవో వెటర్నరీ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా ఎం ఆనంద్ ఎన్నికయ్యారు. వెటర్నరీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బింగి సురేష్, కార్యదర్శి పోరెడ్డి అభిషేక్‌రెడ్డి, తెలంగాణ నాన్‌గెజిటెడ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు వారి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం ఆనంద్, కార్యదర్శిగా ఎం గణేష్, గౌరవ అధ్యక్షుడిగా బి రాజేష్, కోశాధికారిగా రమణ, ఉపాధ్యక్షులుగా జి రూప, బి రవి, ప్రశాంత్, అంజంఖాన్, నాగరాజ్, గంగాధర్, సంతోష్, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

గ్రామ పరిపాలనాధికారులను సత్వరం నియమించాలి

జగిత్యాల అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామ పరిపాలనాధికారులను సత్వరం నియమించాలి గ్రామ పరిపాలన అధికారుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో 286 గ్రామాలున్నాయని, దీని ప్రకారం గ్రామానికి ఒకరు చొప్పున గ్రామ పరిపాలనాధికారులను నియమించాల్సి ఉందన్నారు. గతంలో చేపట్టిన రాత పరీక్షల్లో అర్హత సాధించిన 119 మందిని 119 గ్రామాలకు నియమిస్తే మరో 127 గ్రామాలకు అధికారుల కొరత ఉంటుందని తెలిపారు.

క్రీడా పాఠశాల ఎంపికకు దరఖాస్తు చేసుకోవాలి

బీర్‌పూర్,జూన్ 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలో 2025-26 సంవత్సరానికి 4వ తరగతి ప్రవేశానికి విద్యార్థిని, విద్యార్థుల ఎంపికకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండలవిద్యాధికారి నాగభూషణం తెలిపారు. శుక్రవారం బీర్‌పూర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూపీఎస్, పీఎస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ఈ నెల 15 సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హకీంపేట్ పాఠశాలలో బాలురకు (20) బాలికలకు(20), కరీంనగర్‌లోని పాఠశాలలో బాలురకు(20) బాలికలకు(20), ఆదిలాబాద్‌లో బాలురకు (20) బాలికలకు(20) సీట్లు ఉన్నాయన్నారు. 01-09-2016 నుంచి 31-08-2017 మధ్య జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఎంపిక విధానం మొదటిగా మండలస్థాయిలో 16వ తేదీ నుంచి 19వతేదీ వరకు మండల కేంద్రంలోని విద్యాధికారి ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. జిల్లాస్థాయిలో 26వ తేదీన స్వామి వివేకానంద మినీ స్టేడియం గొల్లపల్లి రోడ్, జగిత్యాల డీవైఎస్‌వో ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జూలై 1, 2వ తేదీల్లో హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో పీడీలు లక్ష్మణ్, మంజుల ధరణి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో గిరిజన సంక్షేమ మినీ గురుకుల పాఠశాలలో(బాలికల) మల్లాపూర్ విద్యాలయంలో బోధనేతర సిబ్బందిని అవుట్ సోర్సింగ్ పద్ధతిపై భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి డీఎస్ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులై ఆసక్తిగలిగిన స్థానిక గిరిజన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కుక్(01), కిచెన్ హెల్పర్(01), ఆయా(01), వాచ్‌మెన్(01) పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అర్హత, ఆసక్తిగల స్థానిక గిరిజన మహిళ అభ్యర్థులు మినీ గురుకులం ఒడ్డెలింగాపూర్ పాఠశాలలో బయోడేటా, విద్యార్హతల జిరాక్స్ పత్రాలతో ఈ నెల 20వ తేతిదఈలోపు దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు హెచ్ఎం శ్రీలత 9652141962 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

గొల్లపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులభర్తీకి గంటల ప్రాతిపదికన పనిచేసేందుకు అర్హతగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో పెర్కొన్నారు. పిజిటి ఇంగ్లీష్, ఫిజిక్స్, తెలుగు పోస్టులకు గాను అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ, బీఈడీ పూర్తి చేసి ఉండాలని, టీజీటీ సోషల్, ఇంగ్లీష్, హిందీకి గానూ అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్‌లో డిగ్రీ, టీఈటీ పాసై ఉండాలని పేర్కొన్నారు.

మల్లాపూర్ - హైదరాబాద్ బస్సు నడపాలి

కోరుట్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల నియోజకవర్గంలోని మల్లాపూర్ మండల కేంద్రం నుంచి హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ శుక్రవారం రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు కలిసి వినతి పత్రంను అందించారు. హైదరాబాదులోని మంత్రి నివాసంలో మంత్రిని పొన్నం ప్రభాకర్‌ను జువ్వాడి కృష్ణారావు కలిసి పూలమాల శాలువాలతో సత్కరించి సన్మానించారు.

సేంద్రియ ఎరువులను వాడాలి

కోరుట్ల రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులను వాడి రైతులు అధిక దిగుబడులు పొందాలని మండల వ్యవసాయాధికారి నాగమణి, జన వికాస ప్రోగాం కో ఆర్డినేటర్ మనీషా అన్నారు. శుక్రవారం మండలంలోని ధర్మారంలో వ్యవసాయ శాఖ, జన వికాస సచ్చంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు శ్రీహరి, బాపురెడ్డిలు పాల్గొన్నారు.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

కథలాపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరికొండలో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. పొలాస వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఏడీఆర్ శ్రీలత ఆధ్వర్యంలో రైతులకు సాగు పద్ధతులను వివరించారు. శాస్త్రవేత్తలు గేన్యా నాయక్, స్వాతి, ఏఓ యోగిత, ఏఈఓలు సుష్మ, శేఖర్, సంధ్య ఉన్నారు.

వంట కార్మికులకు వైద్య పరీక్షలు

కథలాపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరికొండ, కథలాపూర్, దూలూరు గ్రామాల్లో శుక్రవారం పాఠశాలల్లో వంటలు చేసే కార్మికులకు ఆర్‌బీఎస్‌కే వైద్యులు సురేందర్, తబస్సుమ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంఈవో లోకిని శ్రీనివాస్, ఇన్‌చార్జి హెచ్ఎం వనతడుపుల రవికుమార్, అశోక్, చంద్రశేఖర్‌రావు తదితరులు ఉన్నారు.

విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

కథలాపూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనుక్షణం ప్రజల్లో ఉంటూ అనేక అభివృద్ధి పనులను చేపడుతున్నారన్నారని పేర్కొన్నారు.

సంక్షిప్త సమచారం..

ఆలయ నిర్మాణానికి విరాళం

మల్లాపూర్, జూన్, 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిపేట గ్రామ శివారులో నిర్మిస్తున్న కోటిలింగేశ్వరాలయానికి స్థానిక భక్తులు విరాళం అందజేశారు. శుక్రవారం ఆలయంలోని స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఎదులాపురం రాజశేఖర్ దంపతులు రూ. 10,016లను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయాభివృద్ధి కమిటీ నాయకులు శ్రీధర్, ప్రభాకరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందజేయాలి

మల్లాపూర్, జూన్, 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెనూ ప్రకారం భోజనం అందజేయాలని తహసీల్దార్ రమేష్ నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం మండలం లోని రత్నాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలోని రికార్డులు, ఆహార పదార్థాలు, నిత్యావసర వస్తువులు, గుడ్లను పరిశీలిం చారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి వివేక్‌ను కలిసిన నాయకులు

జగిత్యాల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్‌ను జగిత్యాల జిల్లా మాల మహానాడు నాయకులు హైదరాబాద్‌లోని తన నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా ఆయనను సత్కరించి, అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో సంఘ వివిధ హోదాల బాధ్యులు మద్దెల నారాయణ, ఉరుమట్ల లక్ష్మణ్, బత్తుల ప్రదీప్, మ్యాదరి శ్రీహరి, మేకల రాజు తదితరులు ఉన్నారు.

'అక్రమంగా మొరం తరలింపు'

మెట్‌పల్లి రూరల్, జూన్, 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోనరావుపేట, కొండ్రికర్ల గ్రామాల నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న వారిపై చర్యలు లేవని గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు అధికారులను ప్రశ్నించారు. కోనరావుపేట గ్రామ ప్రధాన రహదారి పక్కన ఉన్న మొరంను అక్రమంగా గ్రామానికి చెందిన పలువురు కొండ్రికర్ల చెరువు కట్ట నుంచి అక్రమంగా తొలగిస్తున్నారని ఇటీవల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని శుక్రవారం గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చాలా కాలంగా పెండింగ్‌లో తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు జగిత్యాల జిల్లా ఎన్‌హెచ్ఎం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం జిల్లా కేంద్రంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో చందు, సంతోష్ పాల్గొన్నారు.

'కొప్పుల జీవన గమనమే ఒక ప్రస్థానం'

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో కొప్పుల ఒక ప్రస్థానం పుస్తకాన్ని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత, మార్క్‌ఫెడ్ స్టేట్ మాజీ చైర్మెన్ లోక బాపురెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికునిగా తన జీవిత ప్రయాణం ప్రారంభించిననాటి నుంచి తన ప్రయాణంలో ఎదుర్కొన్న సంఘటనలను పుస్తకరూపంలో ప్రచురించడం గొప్ప విషయమని తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

మల్యాల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన ఎల్ఎండీకి చెందిన రమేష్ అనే భక్తుడు తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా పోలీస్ అవుట్‌పోస్ట్ ఏఎస్సై చిలుక శ్రీనివాస్ శుక్రవారం అందించారు. మూడు రోజుల క్రితం కొండగట్టుకు వచ్చిన భక్తుడు అక్కడ గల టీపాయింట్ వద్ద సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో పోలీసులు వెతికి అప్పగించారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాలరూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ శివారులోగల తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గునుక శ్రీలత తెలిపారు. ఎంపీసీ, ఎంఎస్సీఎస్, బీ జెడ్‌సీ, ఫుడ్ సైన్స్, బీకాం కంప్యూటర్స్, బీఏ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ మీడియం డిగ్రీ కోర్సుల్లో ఈనెల 23 వరకు

గ్రామ దేవతలకు ఘనంగా బోనాలు

రాయికల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాట్లవాయి గ్రామంలో అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో, రాయికల్ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు శుక్రవారం బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా విగ్రహ దాతలు మ్యాడం సత్తయ్య, చిట్యాల గంగాధర్, రంజిత్‌ను గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో అన్ని కుల సంఘాల నాయకులు రాజేందర్, తిరుపతి, అజయ్, గంగారాం, గంగాధర్, మహేష్, అంజిత్, రాజు, చంద్రయ్య. మున్నూరుకాపు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, మంత్రి వివేక్‌తో జువ్వాడి నర్సింగరావు

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన జువ్వాడి

కోరుట్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మహేష్ కుమార్‌గౌడ్‌ను కలిసి స్థానికంగా పార్టీ పరిస్థితిని వివరించారు. అభివృద్ధి పనులకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్‌ను పూలమాలలు శాలువాలతో నర్సింగరావు సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విమాన ప్రమాదంపై విచారణ జరపాలి

జగిత్యాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన ప్రమాద దుర్ఘటనపై న్యాయ విచారణ జరపాలని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పొయిన వారికి జగిత్యాలలో మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్ కాంగ్రెస్ కార్యాలయం నుంచి ర్యాలీని ప్రారంభించి తహసీల్ చౌరస్తా వరకు నిర్వహించారు. అనంతరం తహసీల్ చౌరస్తా వద్ద క్యాండిల్స్ వెలిగించి ప్రదర్శన జరిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, నాయకులు దుర్గయ్య, గుండ మధు, గిరి, రాజేష్, హరికృష్ణ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, కార్యకర్తలు